క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలి



కాకుమాను: గ్రామాలలో చెత్త సేకరణకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికులకు గ్రామస్తులు సహకరించాలని ఎంపీడీఓ కె.యుగకీర్తి అన్నారు. మండల కేంద్రం కాకుమానులో బుధవారం చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణకు వచ్చిన సమయంలో స్థానికులు తడి, పొడి చెత్తను వేరు చేసి వాహనంలో వేయాలని ఆమె కోరారు. చెత్త ద్వారా సంపద సృష్టించాలనేదే ప్రభుత్వం లక్ష్యమని.. ప్రజలందరూ కార్మికులకు సహకరించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ సీహెచ్ రవిబాబు, పంచాయతీ కార్యదర్శి పి.రమణయ్య, సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధచూపాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కెన్నడీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు రోజూ భోజన పథకం అమలును పర్యవేక్షిస్తూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



పెదకాకాని: ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సెంటర్‌లో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపనేని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లపై చిన్న చిన్న పొరపాటులకు భారీ మొత్తంలో జరిమానాలు, జైలు శిక్షలు లాంటి న్యాయ సంహిత సెక్షన్లు తీసుకు వచ్చిందన్నారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో వాహనాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.రాజా రమేష్, కె.సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంగం నాయకులు బి.బాబురావు, యు.శివయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ ఇస్మాయిల్, యాకోబు, అప్పారావు, సుబ్బారెడ్డి, బుల్లెబాయి, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో విజిలెన్స్ తనిఖీలు



ప్రత్తిపాడు: పెదనందిపాడు మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెటరాలజీ అధికారులు బుధవారం విస్తృత తనిఖీలు చేశారు. తొలుత స్థానిక ఇండియన్ పెట్రోలు బంకులో తనిఖీలు చేపట్టి పెట్రోలు, డీజిల్ నాణ్యత, బంకులో వినియోగదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలోని 16 నంబరు చౌక ధరల దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించి.. బియ్యం, పంచదారల నిల్వల్లో వ్యత్యాసాలున్నట్లు గుర్తించారు. స్టాక్ రిజిస్టరులో ఉన్న లెక్కల కన్నా అదనంగా దుకాణంలో 70 కేజీల బియ్యం, 70 ప్యాకెట్ల పంచదార ఉన్నట్లు గుర్తించినట్లు సీఎస్ డీటీ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు దుకాణ నిర్వాహకులపై కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, లీగల్ మెటరాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజ్, విజిలెన్స్ డీటీ మాధవి ఉన్నారు.

ఆర్టీసీ డిపో డీఎం బదిలీ

పొన్నూరు: పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజరు అజిత కుమారి పల్నాడు జిల్లా డీపీటీవోగా బదిలీ అయ్యారు. గుంటూరు-2 డిపో మేనేజరు రామకృష్ణ పొన్నూరు ఇన్‌చార్జ్ డిపో మేనేజరుగా వ్యవహరించనున్నారని డిపో కార్యాలయ అధికారులు బుధవారం తెలిపారు.

నిర్వహణ పనులకు రాం రాం!



రంగుమారి అధ్వానంగా దర్శనమిస్తున్న ఫిల్టర్ బెడ్



పచ్చ గడ్డితో నిండిపోయిన మరో ఫిల్టర్ బెడ్

గ్రామాల్లో తాగునీటి నిర్వహణ మరీ అధ్వానంగా ఉంది. ఫిల్టర్ బెడ్‌లు సక్రమంగా పనిచేయకపోవడంతో పాటు వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలు గాలికి వదిలేశారు. దీంతో నీటి వడపోత ప్రశ్నార్థకంగా మారింది. ప్రత్తిపాడు మండలం వంగిపురం రక్షిత మంచి నీటి చెరువు కట్టపై ఉన్న ఫిల్టర్ బెడ్లు పూర్తిగా అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఒక ఫిల్టర్ బెడ్‌లో నీరు రంగు మారి పాచిపట్టి ఉండగా.. మరో ఫిల్టర్ బెడ్ పచ్చికతో నిండిపోయింది. తాగునీటిని గ్రామంలోనికి సరఫరా చేసే ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్ పరిసరాలన్నీ బురదమయమయ్యాయి. అసలే వర్షాకాలం ఆరంభం.. సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే సమయం కావడంతో నీరు కలుషితమయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తుంది. రక్షిత మంచినీటి చెరువుల వద్ద ఫిల్టర్ బెడ్‌లు ఇంత అధ్వానంగా ఉండటంతో ఏం చేయాలో పాలుపోని ప్రజలు వాటర్ ప్లాంట్ నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. పంచాయతీ అధికారులు సైతం గ్రామంలోనికి రావాటర్‌నే సరఫరా చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– ప్రత్తిపాడు

పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దామని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆయన కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ తరపున అండగా నిలుస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎటుపోయాయని ప్రశ్నించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన అనేక సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల హవా

ప్రత్తిపాడు: తల్లిదండ్రులు, విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా కళాశాలలో విద్యాబోధన జరుగుతుందని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో బుధవారం ప్రముఖ ఔషధ సంస్థ దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఇంటర్వ్యూల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు, నలుగురు మెకానికల్ ఇంజనీర్ విద్యార్థులు, ఒక ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థిని కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేశారని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకాడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి.శ్రీనివాసరావు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, డా.కె.సురేష్ బాబు, ఆయా విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిపురం పోలీస్ స్టేషన్ తనిఖీ



పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల గురించి వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. జూలై 5వ తేదీ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పరిష్కరించే అవకాశం ఉన్న కేసులపై సమీక్ష చేసినట్లు చెప్పారు. నైట్ బీట్ సమర్థంగా నిర్వహించాల్సిందిగా సూచించారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారికి వీలు అయినంత వరకు సహాయం చేయాల్సిన బాధ్యత కలిగి ఉండాల్సిందిగా తెలిపారు. జిల్లా ఎస్పీ తనిఖీలలో వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎ.శ్రీనివాసరావు, స్టేషన్ సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐలు నరహరి, సుబ్బారావు, తరంగిణీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

నగరంలో పారిశుద్ధ్యం నూరు శాతం మెరుగు

కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, పక్కన తూర్పు ఎమ్మెల్యే నసీర్

నెహ్రూనగర్: నగరంలో మైక్రో ప్లాన్ మేరకు నూరు శాతం మెరుగైన పారిశుద్ధ్యం అందించేలా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి, తూర్పు నియోజకవర్గంలో కార్పొరేటర్లు, ప్రజారోగ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లతో పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎలక్షన్ డివిజన్ల వారీగా ఒక్కొక్క వార్డుని ఒక్కొక్క శానిటేషన్ డివిజన్‌గా చేస్తూ శానిటరీ సిబ్బందిని కేటాయించడం జరిగిందని వివరించారు. నగరంలో ప్రతి 350 ఇళ్లకు ఒక మైక్రో ప్యాకేట్ ఉంటుందని, మైక్రో ప్యాకెట్ ఇద్దరు కార్మికులని కేటాయించామని చెప్పారు. కార్మికులు ఉదయాన్నే 5.30కు హాజరు అనంతరం 350 ఇళ్ల పరిధిలోని రోడ్ల శుభ్రం చేసుకుంటారన్నారు. అనంతరం ఇళ్ల నుంచి తడి పొడిగా వేర్వేరుగా చెత్త కలెక్షన్ చేసుకోవాలని చెప్పారు. మధ్యాహ్నం తమ మైక్రో ప్యాకెట్ ప్రాంతంలోని డ్రెయిన్లను నూరు శాతం శుభ్రం చేసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో కార్మికులు, కార్యదర్శుల పనితీరుపై ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, వారి పనితీరు పర్యవేక్షణకు ప్రతి వార్డుకు నగరపాలక సంస్థ నుంచి నోడల్ అధికారిని నియమించామని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రాబోయే నెలరోజుల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ని సిద్ధం చేస్తున్నామని.. దాని ద్వారా ఏఐ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ సాయంతో వర్కర్స్ హాజరు, క్షేత్ర స్థాయిలో పనితీరు, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేస్తుంది, లేనిదీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తామన్నారు. కార్పొరేటర్లు తమ డివిజన్లలో అవసరాల రీత్యా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారని, అది కూడా పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించారు. కమర్షియల్ సంస్థలు తప్పనిసరిగా కమర్షియల్ ఏజెన్సీలకే వ్యర్థాలు ఇవ్వాలని, అలా కాకుండా రోడ్లు, డ్రెయిన్లలో వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓ(ఇన్‌ఛార్జ్) జె.రామారావు, ఎస్ఎస్‌లు ఆయూబ్ ఖాన్, సాంబయ్య పాల్గొన్నారు.

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రధానంగా శివారు ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, అంతర్గత డ్రెయిన్లు, మేజర్ డ్రెయిన్లలో కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద నిలిచే వ్యర్థాలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కమిషనర్ రెడ్డిపాలెం, విఘ్నేశ నగర్, పోస్టల్ కాలనీ, వర్కర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను డ్రోన్ ద్వారా పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, కార్పొరేటర్ కె.రంగారెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనాదారులపై చర్యలు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను వాహనాల్లో పరిమితికి మించి ఆటోల్లో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ హెచ్చరించారు. బుధవారం ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఓవర్ లోడు, ఓవర్ స్పీడ్, ఓవర్‌టేక్, లైసెన్సు లేకుండా నడుపుతున్న వాహనాలు, ధృవీకరణ పత్రాలులేని పాఠశాల, కళాశాలలకు చెందిన వాహనాలపై చలానా విధించారు. పది వాహనాలకు రూ. 20వేలు అపరాధ రుసుము విధించారు. ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవర్ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఆటోలు, తదితర మిని క్యాబ్‌ల వారు విద్యార్థులను అధిక సంఖ్యలో ఎక్కించుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని వెల్లడించారు.

రాయితీపై కిసాన్ డ్రోన్లు

ప్రత్తిపాడు: రైతులకు 80 శాతం రాయితీపై కిసాన్ డ్రోన్లు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ భేగం తెలిపారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు డీలర్ వద్ద తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సీజన్ ముగిసే వరకు రైతులు బిల్లులు, విత్తనాల ప్యాకెట్లును జాగ్రత్తగా భద్ర పరుచుకోవాలని సూచించారు. సమావేశంలో ఉప సర్పంచ్, సెక్రటరీ, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొన్నూరు: మండలంలోని గోళ్లమూడిపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ఆర్.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అధీకృత డీలరు వద్దనే వరి విత్తనాలు కొనుగోలు చేయాలని.. తప్పనిసరిగా బిల్లును తీసుకోవాలని సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరుచూరి రాజ్యలక్ష్మీ, వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు ఏ.అరుణ, ఎంపీఈఓ ఎస్.సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



సుద్దపల్లి(చేబ్రోలు): చెత్తాచెదారాలు, వ్యర్థాలను రోడ్లపై వేయకూడదని.. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి వి.సాయికుమార్ అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో బుధవారం పారిశుద్ధ్యం, తాగునీరు, మురుగు పారుదల తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, సర్పంచ్ ఎన్.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్‌ను కూల్చేశారు



నెహ్రూనగర్: టీడీపీ నాయకుడి ఇంటిలోకి గాలి రావాడంలేదనే కారణంతో సదరు నాయకుడి ఇంటిని అనుకోని ఉన్న రేకుల షెడ్‌ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు బుధవారం సాయంత్రం కూల్చివేసిన ఘటన గుంటూరు నగర పరిధిలో 28వ వార్డు వెంకటరమణ కాలనీలో రెండవ లైనులో చోటుచేసుకుంది. జీవనోపాధి కోసం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి గుంటూరుకి వచ్చి తిని తినక కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుంటే ఆ ఇంటి వెనుక ఉండే టీడీపీ వ్యక్తి ఇంటికి కేవలం గాలి రావడం లేదనే కారణంతోనే కర్రీస్ వ్యాపారం చేసుకునే రేకుల షెడ్‌ని కూల్చివేయడంపై దూమారం రేగింది. నగర మేయర్‌తో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నుంచి వచ్చిన వత్తిళ్ల కారణంగానే నగరపాలక సంస్థ అధికారులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రంగరాజును కలిసిన మాధవ్



గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పి.వి.ఎన్.మాధవ్ బుధవారం బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు రైలుపేటలోని నివాసానికి విచ్చేసి జనసంఘ్ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ జూపూడి యజ్ఞ నారాయణ సతీమణి జూపూడి హైమవతమ్మ ఆశీస్సులు పొందారు. మాధవ్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కొత్తూరి వెంకట సుబ్బారావు, యడ్లపాటి స్వరూపరాణి, నేరెళ్ల మాధవరావు, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, చరక కుమార్ గౌడ్, వై.వి.సుబ్బారావు, రాచుమల్లు భాస్కర్, సురేష్ జైన్, బజరంగ్ రామకృష్ణ, నడ్డి నాగ మల్లేశ్వరి, దేసు సత్యనారాయణ, బొల్లాప్రగడ శ్రీదేవి, జితేంద్ర గుప్తా, ఇండ్ల శ్రీధర్, వీరమణీంద్ర, దర్శనపు శ్రీనివాస్, దారా అంబేద్కర్, స్టాలిన్ ఉన్నారు.

నిరసనలపై ఆంక్షలు ఎత్తివేయాలి

లక్ష్మీపురం: జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ నిరంతరం శాశ్వతంగా అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ ప్రకటించడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఖండించారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లా పోలీసు అధికారుల ప్రకటన ప్రకారం సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు చేయాలంటే వారం రోజులు ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలని ప్రకటించడమే కాక ఇలాంటి నిరంకుశ విధానాలు శాశ్వతంగా అమలులో ఉంటాయని చెప్పడం ప్రజాస్వామిక వాదుల గొంతునొక్కడే అవుతుందని పేర్కొన్నారు.

వీధి వ్యాపారులకు దినదినగండం



ఐలాండ్ సెంటర్‌లో పండ్ల దుకాణాలు

పొన్నూరు: పట్టణ పరిధిలో చిరు వ్యాపారుల పరిస్థితి దినదినగండంగా మారింది. రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేసే వారిని మున్సిపాలిటి అధికారులు, పోలీసులు వచ్చి తరచూ హెచ్చరిస్తుండటంతో వారంతా బిక్కుబిక్కుమంటూ బతుకుబండి నెట్టుకొస్తున్నారు. ఆక్రమణలపై అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించే సమయాల్లో చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటి నుంచి ఐడీ కార్డులు పొంది, ఆశీలు రూపంలో ఆదాయం సమకూరుస్తున్నా వారికి అవస్థలు తప్పడం లేదు.

పట్టణంలో 2 వేలకు పైగా చిరువ్యాపారులు..

పొన్నూరుతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారరీత్యా వచ్చిన చిరువ్యాపారులు దాదాపుగా 2 వేల మందికి పైగా ఉన్నారు. వీరంతా పట్టణంలోని వ్యాపార కూడళ్లలో పండ్లు, పూలు, కూరగాయలు, తదితర వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా ఐలాండ్ సెంటర్, కసుకర్రు రోడ్డు, జీబీసీ రోడ్డు, ఎస్బీబీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, తదితర ప్రధాన రహదారుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటి కూడా వారికి వ్యాపార భద్రత కల్పించేందుకు వ్యాపారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి కొంత రుసుము వసూలు చేస్తోంది. వీటితో పాటు ఆశీలు సైతం రోజూ రూ.20కి పైగానే వసూలు చేస్తున్నారు. అయితే వీరి వ్యాపారాలకు భద్రత ఉండటం లేదు. అప్పుడప్పుడూ మున్సిపల్ అధికారులు వారిపై ప్రతాపం చూపిస్తున్నారు. తమను ఇబ్బందులకు గురిచేయవద్దని వ్యాపారులు కోరుతున్నారు.

ఐడీ కార్డులు రెన్యువల్ చేసుకోవాలి..



పట్టణ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే వారు మున్సిపాలిటి నుంచి తప్పక ఐడీ కార్డులు పొందాలి. గతంలో తీసుకున్న ఐడీ కార్డుల కోసం రూ.100 చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి. పట్టణంలో సుమారు 2 వేలకు పైగా వ్యాపారులు ఉన్నారు. కానీ ఇప్పటి వరకు 50 మంది మాత్రమే రెన్యువల్ చేసుకున్నారు. మిగిలిన వారు కూడా వెంటనే రెన్యువల్ చేసుకోవాలి.

– హనుమా నాయక్, సీఎంఎం, మెప్మా, పొన్నూరు

న్యాయం కోసం అత్తింటి ముందు మౌన పోరాటం

పెదకాకాని: కుటుంబ పోషణ కోసం అత్తవారి ఇంటి ముందు నిరసన తెలియజేసినా కనికరించడం లేదని బాధితురాలు పెద్ది స్వప్న ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం.. పెదకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన పెద్ది ప్రసాదరావు, సులోకతార దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమారుడు పెద్ది రాజేష్‌కుమార్‌కు పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం అవిశాయపాలెంకు చెందిన స్వప్నతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఏడాదిన్నర కిందట రాజేష్‌కుమార్ అనారోగ్యంతో మరణించాడు. మృతుడు రాజేష్ పేరిట గ్రామంలో రెండు ఇళ్లు, సుమారు 2 ఎకరాలు పొలం ఉంది. రాజేష్ పేరిట ఉన్న ఆస్తిని కుటుంబ పోషణకు ఇవ్వాలని స్వప్న పలుమార్లు కోరినప్పటికీ అత్తింటి వారు కనికరించలేదు. దీంతో స్వప్న బుధవారం ఉప్పలపాడు అత్తింటి ఆవరణలో మౌన పోరాటం చేశారు. సంఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని సమస్య ఉన్నప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించగా ఆమె స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

నాయకత్వం సేవకు ప్రతీక



విద్యార్థులతో ఎస్పీ చక్రవర్తి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి

పెదకాకాని: నాయకత్వం అధికారానికి కాదని.. సేవకు ప్రతీక అని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగం ఎస్పీ కె.చక్రవర్తి అన్నారు. పెదకాకాని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో బుధవారం పదవీ స్వీకార(ఇన్వెస్టిచర్) వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ సంధ్యారాణి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ కె.చక్రవర్తి మాట్లాడుతూ.. ఎస్పీఎల్, ఏఎస్పీఎల్, క్లాస్ లీడర్, స్పోర్ట్స్ కెప్టెన్ బాధ్యతల్లో ఆదర్శవంతంగా పనిచేయాలన్నారు. నైతికత, క్రమశిక్షణ, సేవా దృక్పథం వంటివి నాయకత్వానికి మూలస్తంభాలన్నారు. గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాయకత్వం గురించి ప్రేరణాత్మకంగా వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సంధ్యారాణి విద్యరంగంలో చేసిన విశిష్ట కృషికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫాదర్ ధర్మరాజు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి

ప్రత్తిపాడు: నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిసెటంట్లుతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీటి ద్వారా ప్రజలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ఈ నెల 6వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులతో పాటు వాటర్ క్లోరినేషన్ పనులను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదం షఫీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

FORM NO. NCLT. 3A
Advertisement detailing petition [see rule 35]
CP/8/241/AMR/2025

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ అమరావతి బెంచ్, మంగళగిరి

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ రూల్స్ 2016తో చదవబడు
కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 241, 242, 244 మరియు వాటి సవరణలు

మధ్య
శ్రీ ఉమామహేశ్వర్ మిట్టపల్లి ...పిటీషనర్

మరియు

1) మెస్సర్స్ మిట్టపల్లి రామారావు అండ్ సన్స్ టొబాకోస్ ప్రైవేట్ లిమిటెడ్
నెం. U16001AP1999PTC031315 ...రెస్పాండెంట్ 1
2) శ్రీ మిట్టపల్లి శివకుమార్ ...రెస్పాండెంట్ 2
3) శ్రీ మిట్టపల్లి ధీరజ్ కృష్ణ ...రెస్పాండెంట్ 3
4) రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, ఆంధ్రప్రదేశ్ ...రెస్పాండెంట్ 4

పిటిషన్ నోటీసు

పిటీషన్‌తో పేర్కొన్న విధంగా ఉపశమనం కోసం కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 241, 242, 244 క్రింద పిటీషన్ రిఫరెన్స్‌ను శ్రీ ఉమామహేశ్వర్ మిట్టపల్లి 28-04-2025న సమర్పించారు, మరియు ఆ పిటీషన్ 31-07-2025న నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ గౌరవనీయ అమరావతి బెంచ్ ముందు విచారణకు నిర్ణయించబడినది. సదరు పిటీషను/దరఖాస్తు/సూచనను సమర్థించాలని లేదా వ్యతిరేకించాలని కోరుకునే ఎవరైనా పిటీషనర్ న్యాయవాదికి తన ఉద్దేశ్య నోటీసును, వారి లేదా వారి యొక్క న్యాయవాది సంతకంతో పేరు మరియు చిరునామాతో పంపవలెను, తద్వారా విచారణకు నిర్ణయించిన తేదీకి రెండు రోజుల ముందు పిటీషనర్ న్యాయవాదికి చేరుతుంది. వారి పిటీషన్‌ను వ్యతిరేకించాలని కోరుకునే చోట, వ్యతిరేకతకు గల కారణాలను లేదా వారి అఫిడవిట్ కాపీని సదరు నోటీసుతో జతచేయవలెను. సదరు పిటీషను/దరఖాస్తు/సూచన క్రింద సంతకం చేసిన వ్యక్తి దానికి నిర్దేశించిన ఛార్జీలు చెల్లించిన తరువాత, దానిని కోరుతున్న ఏ వ్యక్తికైనా అందజేయవచ్చును.
తేది: 02-07-2025

రాధాకృష్ణ పి.వి.కె.ఎస్ (పిటీషనర్ తరుపు న్యాయవాది)
చిరునామా: 15-183, రోడ్ నెం.4, ఎన్‌బిఆర్ ఎక్స్‌టెన్షన్ కాలని, మీర్‌పేట్, హైదరాబాద్-500097,
advocateradhakrishna572@gmail.com, ఫోన్: 9247579233

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com